

# సంసారంలో సరిగమలు
## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### మేనత్త కొడుకు

**"చచ్చినా నేను బావని చేసుకోను"** కాళ్ళు టపటపా నేలకేసి కొట్టి అరిచింది మేఘన.

నిస్సహాయంగా భర్తవైపు చూసింది అనంతలక్ష్మి.

"వాడికేం తక్కువ? ఎందుకలా అరుస్తావు?" ఆయన అనునయంగా అడిగాడు.

"లేకపోతే ఏంటి నాన్నా. బావని పెళ్ళి చేసుకోవడం ఏమిటి అసహ్యంగా?" దుఃఖంగా అడిగింది మేఘన.

"అసహ్యం ఏంటి? వాడు ఐ.ఎస్.బిలో యం.బి.ఏ చదివి పెద్ద కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు" అనంతలక్ష్మి అడ్డుపడింది.

"అందుకే. నేను వేరే బయటి అబ్బాయిని చేసుకుంటే వాడు వీడు అనేదానివా? మేనల్లుడు అల్లుడైతే గౌరవమే ఉండదు."

"అదే నా నీ అభ్యంతరం?"

"అదేకాదు. ఇంకా చాలా అభ్యంతరాలు ఉన్నాయి. నేను చచ్చినా బావని చేసుకోను" గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది మేఘన.

"ఈ పిల్ల మాట వినేట్లు లేదు ఏం చెయ్యాలి?" అనంతలక్ష్మి భర్తని అడిగింది.

"ఇరవై దాటిన పిల్లని అడక్కుండా నువ్వు మాట ఇవ్వడం తప్పు అప్పటికే నేను చెప్తూనే ఉన్నాను. ఐనా నా మాట ఎప్పుడు విన్నావు కనక" ఆయన నిష్ఠూరంగా అన్నాడు.

"మీ అక్క 'నా కొడుకు నేనేం చెప్పినా కాదనడు. నా ఇష్టమే వాడిష్టం' అనేసరికి నేనూ అలాగే అనేసాను. నాకేం తెలుసు ఇదింత మూర్ఖంగా వద్దంటుందని."

"సరే. నయానో భయానో చెప్పి నువ్వే ఒప్పించు. ఆడపిల్లలు ఇలాంటివి తల్లితోనే పంచుకోగలరు."

బాధ్యతంతా తన మీద వేసి వెళ్తున్న భర్తని చూసి అనంతలక్ష్మి మనసులోనే తిట్టుకుంది.

"మేఘా! అన్నం తిందువుగానిరా."

"నాకేం అక్కర్లేదు."

"మాతల్లి కదూ.రా!"

"వద్దన్నా కదా?"

అనంతలక్ష్మి ఓ ప్లేట్లో అన్నం కలుపుకుని మేఘన గది తలుపు తట్టింది. తీసే ఉంది. మేఘన మంచం మీద బోర్లా పడుకుని ఉంది.

"నీ మంచి కోసమే కదరా నాన్నా" అనునయంగా చెప్పింది.

"ఏంటి నా మంచి? ఇన్నేళ్ళు అత్తా నువ్వూ ఉప్పు నిప్పు కదా! మరి సడన్‌గా ఈ పెళ్ళేంటి?"

"అదేనమ్మా తాత.."

"నాకు తెలుసు తాత చాణక్యుడ్ని చంపి పుట్టాడు. ఆయన సంపాదించిన ఆస్తి, నాన్న, మామయ్య సంపాదించబోయేది బయటివాళ్ళెవరో ఎందుకు తినాలి? మనవాళ్ళే తినాలి అని మీ బ్రెయిన్ వాష్ చేసుంటారు. దాంతో ఉప్పు నిప్పు కాస్త పాలు నీళ్ళలా కలిసిపోయి నా మీద పడ్డారు. అసలు ఆ చింతా గాడ్ని పెళ్ళి చేసుకోవడం ఏంటమ్మా?" అసహనంగా అడిగింది.

"చింటూనే వాడి పేరు. చింతా కాదు." అనంతలక్ష్మి సరిదిద్దింది.

"చిన్నప్పుడు, అంటే నువ్వూ అత్తా కొట్లాడుకోక మునుపు సెలవులకి తాతా వాళ్ళు ఊరువెళ్ళేదాన్నికదా. వాడూ వచ్చేవాడు. ఎప్పుడూ అల్లరి చేస్తూనే ఉండేవాడు. అందుకని తాత 'ఏరా నీకు చింతా వారమ్మాయితో పెళ్ళి చేయనా? వేపా వారమ్మాయితో పెళ్ళి చేయనా?' అని అడిగేవాడు. అందుకని చింటూని చింతా అని ఏడిపించేవాళ్ళం. ఓసారి ఇంట్లో చెప్పకుండా జీతగాళ్ళతో కాలువ కెళ్ళి ఈతలు కొట్టాడని తాతయ్య దూడని కట్టేసే తాడుతో కొట్టాడు చూడు.

"వద్దు తాతా! ఇంక ఎప్పుడూ కాలువకి వెళ్ళను తాతా" అని కింద పొర్లిగింతలు పెట్టి ఏడ్చాడు. వాడు మొగుడేంటే?" అనంతలక్ష్మి తెరిపిగా నవ్వింది.

"ఇదేనా నీ సమస్య? వాడిప్పుడు ఇంకా అలాగే ఉంటాడనుకున్నానా? తాతకి ప్రాణం తెలుసా? ఆయన పది మాటలు మాట్లాడితే ఆరు చింటూ గురించే ఉంటాయి. చిన్నప్పటి అల్లరి అంతా పోయి పెద్దమనిషి తరహాగా తయారయ్యాడట."

"ఏమో వాళ్ళు వస్తారంటేనే నువ్వు ఊరైనా, పెళ్ళిళ్ళ పేరంటాలైనా ఎక్కడికో పంపేదానివి కాదు. పాపం నాన్నని వాళ్ళ అక్కని కూడా చూడనివ్వలేదు." నిష్ఠూరంగా చెప్పింది.

"నిజమే. నేను చేసింది తప్పే. పెద్దవాళ్ళు కూడా ఇంతకాలం ఊరుకుని ఇప్పుడిలా ఇద్దర్నీ పిలిచి ఈ పెళ్ళి ప్రపోజల్ చెప్పారా. మీ అత్తేమో 'నాకు అభ్యంతరం లేదు. మా వాడికి నేనేది చెపితే అదే వాడిని అడగక్కర్లేదు' అంది. నేను కూడా అదే అన్నాను."

"ఇక్కడా నీకు అత్తతో పోటీనే. కావలించుకున్నంత మాత్రాన కడుపులో కక్షలు పోతాయా?"

"నన్నేమైనా అను బంగారం. కానీ ఈరోజుల్లో బయటి సంబంధాల గురించి ఎన్ని వినడంలేదు? మీ అత్తయితే అన్న కూతురువని నిన్ను ప్రేమగా చూసుకుంటుంది. చింటూ కూడా మంచి కుర్రాడు. ఒప్పుకోవే." అనంతలక్ష్మి బతిమాలింది.

"అనంతా! చింటూ వచ్చాడు" బయట నుంచి భర్త పిలుపు వినిపించింది.

"ఇదేంటి? అంటే మీరు ముందే పెళ్ళి చూపులు కూడా అరేంజ్ చేసారా?" మేఘన కోపంగా అడిగింది.

"నీ మీద ఒట్టు నాకు వాడు వచ్చే సంగతే తెలీదు. ఏదో ట్రైనింగ్ కోసం ఈ ఊళ్ళోనే ఉన్నాడని అత్త చెప్పింది. విషయం తెలిసి నిన్ను చూడ్డానికి వచ్చాడేమో? నా పరువు కాపాడవే తల్లీ. కాస్త తయారై బయటికి రా" ఆవిడ హడావిడిగా వెళ్ళిపోయింది.

"ఛ! ఎవర్నయినా ప్రేమిస్తే బావుండేది" మేఘన గొణుగుతూ లేచి తయారవసాగింది. నిజానికి ఆమెకి చింటూ అంటే వ్యతిరేకత ఏమీలేదు. తనకి చెప్పకుండా మాట ఇచ్చారన్న కోపం తప్ప.

ఐదు నిమిషాల్లో తయారై బయటికి వెళ్ళిన మేఘన చింటూని చూసి ఆశ్చర్యపోయింది. అందంగా, నీట్‌గా డ్రెస్ చేసుకున్న ఆరడుగుల చింటూ మేన్లీగా ఉన్నాడు. ఆమె మనసులోని ‘చింతాగాడు‘ మెల్లిగా ఫేడవుట్ అయ్యాడు.

"హాయ్ మేఘా" పలకరించాడు.

"హలో" అతని ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది.

ఆ తర్వాత వాళ్ళు దాదాపు అరగంట సేపు మాట్లాడుకుంటూనే ఉండిపోయారు. అనంతలక్ష్మి భర్తవైపు ఆనందంగా చూసింది.

"ఇంక నేను వెళ్తా అత్తా. భోజనానికి మరోసారి వస్తాను. పనుంది." బై చెప్పి చింటూ వెళ్ళిపోయాడు.

పావుగంట తర్వాత మేఘన గదిలోకి వెళ్ళిన అనంతలక్ష్మి వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆమెని చూసి నిర్ఘాంతపోయింది.

"ఏమైంది? ఇంతసేపు బాగానే మాట్లాడావు కదా?" కంగారుగా అడిగింది.

తల్లిని వాటేసుకుని మేఘన బావురుమంది.

"చింటూ మంచివాడు. అతని అభిరుచులు, ఐడియాలు అన్నీ బావున్నాయి. అచ్చం నాలాగే ఆలోచిస్తాడు. కానీ.. కానీ.."

"కానీ? ఏమైంది?"

"చింటూది మేనమామ పోలిక. అచ్చం నాన్నలా ఉన్న చింటూని ఎలా పెళ్ళిచేసుకోను?" మేఘన వెక్కిళ్ళ మధ్య అడిగింది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story